
సాక్షి గుంటూరు

గురువారం । 1 । మే । 2025



ఆంజనేయుడికి మల్లెపూల అర్చన

సత్తెనపల్లి: నాగన్నకుంటలోని శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామిని మల్లెపూలతో అలంకరించి అర్చన జరిపారు.



ముగిసిన బాలయేసు చర్చి తిరునాళ్ల

నాదెండ్ల: కనపర్రు బావివద్ద కొలువైయున్న బాలయేసు పుణ్యక్షేత్ర తిరునాళ్ల బుధవారంతో ముగిసింది. విచారణ గురువు జోజయ్య ప్రత్యేక ప్రార్థనలు, దివ్యపూజాబలి నిర్వహించారు.



చందన అలంకారంలో నారసింహుడు

తెనాలి: అక్షయ తృతీయ సందర్భంగా నాజరుపేటలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం వేడుకలు జరిగాయి. చందన అలంకారంతో స్వామి దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

విజయకీలాద్రిపై వైభవంగా తిరు నక్షత్ర మహోత్సవం



తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి సీతానగరం విజయకీలాద్రిపై గల స్వామికి బుధవారం తిరునక్షత్ర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. 1008వ భగవద్రామానుజాచార్యస్వామి తిరునక్షత్ర మహోత్సవాల్లో భాగంగా ఉదయం అభిషేకం, సేవాకాలం, అర్చన, తీర్థప్రసాద గోష్ఠితో కార్యక్రమం సుసంపన్నమైంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి అనుగ్రహాన్ని పొందారు.

రేపటి నుంచి వేద పరీక్షలు

తెనాలి రూరల్:మండలంలోని పెదరావూరు పరిధిలో ఉన్న శ్రీ అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో ఈ నెల 2వ తేదీ నుంచి 4 వరకు వేద పరీక్షలు, సభలు జరుగతాయని కార్యవర్గం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్తికులంతా పాల్గొనాలని కోరింది.

'బత్తి భుచావ్'



లక్ష్మీపురం:వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం మైనారిటీల ఇళ్లు, వ్యాపార సముదాయాలలో బత్తి భుచావ్ (లైట్ ఆఫ్ చేయడం) కార్యక్రమాన్ని చేపట్టాలని ముస్లిం సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 9 గంటల నుంచి గుంటూరు నగరంలో ముస్లింలు ఇళ్లు, పలు వీధుల్లో 15 నిమిషాల పాటు లైట్లు నిలిపి నిరసన వ్యక్తం చేశారు.

రైతులకు మరింత చేరువ కావాలి

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



గుంటూరు రూరల్: విశ్వవిద్యాలయం రైతులకు మరింత చేరువ కావాలని, ఆధునిక టెక్నాలజీ రైతు ఉపయోగించుకునే విధంగా ఎప్పటికప్పుడు సహాయకారిగా ఉండాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవ వేడుకలు గత రెండు రోజులుగా ఘనంగా నిర్వహించారు. బుధవారం ముగింపు ఉత్సవంలో ముఖ్య అతిథిగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు దిగుబడి పెరగడంతో పాటు ఖర్చు తగ్గించే దిశగా ప్రణాళికలు రచించాలని తెలిపారు. పల్నాడు ప్రాంతంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రారంభించేందుకు అనుమతి లభించిందని, దానికి ఆర్థిక (ఫైనాన్షియల్) శాంక్షన్ మాత్రం పెండింగ్‌లో ఉందని తెలియజేశారు. ఇండో-ఇజ్రాయిల్ ప్రాజెక్టు కూడా పరిశోధన చేయనుందని, రైతు సంఘాలను బలోపేతం చేయడానికి ఒక్కొక్క సంఘానికి ఒక రకమైన టార్గెట్ ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని తెలియజేశారు. మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను పరిశోధన నుంచి క్షేత్రస్థాయి వరకు విశ్వవిద్యాలయం చేర్చుతూ (ల్యాబ్ -ల్యాండ్) 60 ఏళ్ల అత్యంత కృషి చేసిందని కొనియాడారు. మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పల్నాడు ప్రాంతంలో రైతుల కష్టనష్టాలను వివరించారు. ప్రస్తుత పంటలకు బదులు ప్రత్యామ్నాయి పంటలైన అనంతపురం ఏరియాలో పండించే ఖర్జూరం గానీ, నేరేడు తదితర ఉద్యాన పంటలు సూచించాలని కోరారు. విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో నాబార్డ్ మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్య విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, మాజీ ఉప కులపతులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు వేళాయె!

- పేద పిల్లలకు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య
- విద్యాహక్కుచట్టం ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్న ప్రభుత్వం
- మే 2 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- గత మూడేళ్లలో ఉచిత సీట్లు పొందిన 1,851 మంది విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: నిర్బంధ విద్యాహక్కు చట్టం-2029 12-1 (సీ) ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లోని 25శాతం సీట్లను నిరుపేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు కేటాయించాల్సి ఉంది. అయితే, చట్టంగా రూపుదాల్చినప్పటికీ అమలు పర్చడంలో ప్రభుత్వాలు ముందుకు రాలేదు, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేద కుటుంబాల పిల్లలు సైతం కార్పొరేట్ విద్యాసంస్థల్లో ధనిక వర్గాలతో సమానంగా విద్యను అభ్యసించాలనే మహత్తరమైన ఆశయంతో నిర్బంధ విద్యాహక్కుచట్టం అమలుకు నాంది పలికారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృఢ నిశ్చయంతో రాష్ట్రంలో 2022లో అమలుకు నోచుకుంది. 2022లో 106, 2023లో 412, 2023లో 1,333 మంది చొప్పున విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

విద్యాహక్కుచట్టం ద్వారా ప్రవేశాలు

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన పేద విద్యార్థులకు 8వ తరగతి వరకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. ఆయా పాఠశాలల్లో ప్రవేశం కల్పిస్తున్న విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజును ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయిస్తుంది. సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ, ఐబీ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశాలకు 2019 ఏప్రిల్ 2 నుంచి, 2020 మార్చి 31 మధ్య జన్మించి, ఐదేళ్ల వయసు నిండిన పిల్లలు అర్హులు. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో 2019 జూన్ 2వ తేదీ నుంచి, 2020 మే 31 మధ్య జన్మించి, ఐదేళ్ల వయసు నిండి ఉండాలనే నిబంధన ఉంది.

కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు

దరఖాస్తు చేసేందుకు నివాస ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులైతే వైకల్య ధ్రువీకరణ, హెచ్ఐవీ బాధితులు సంబంధిత మెడికల్ సర్టిఫికెట్, వార్షిక ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం. ఆధార్‌తో అనుసంధానం చేసిన మొబైల్‌ఫోన్‌కు ఎంపికైన విద్యార్థుల వివరాలను పంపుతారు. కుటుంబ వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తులో పొందుపర్చిన చిరునామా ఆధారంగా పాఠశాలకు సమీపంలో నివసిస్తున్న విద్యార్థులకు ఎంపికలో మొదటి ప్రాధాన్యమిస్తారు.

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం నిరుపేద విద్యార్థులకు ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పించేందుకు ఉద్దేశించిన ప్రక్రియలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు మే 2వ తేదీ నుంచి www.cse.ap.gov.in ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మే 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అనంతరం మే 20 నుంచి 24 వరకు విద్యార్థుల దరఖాస్తులను ఆయా గ్రామ, వార్డు సచివాలయాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. మే 29న లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. జూన్ 8వ తేదీలోపు విద్యార్థులు ఎంపిక చేసుకున్న పాఠశాలల వారీగా అడ్మిషన్ ఖరారు చేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు ఎంపిక చేసిన 524 పాఠశాలలకు గానూ 477 పాఠశాలల యాజమాన్యాలు విద్యాశాఖ సైట్‌లో నమోదు చేసుకున్నాయి.

ఎవరు అర్హులంటే..


ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతిలో 25శాతం సీట్లను విధిగా కేటాయించాల్సి ఉంది. ఇందులో ఐదు శాతం సీట్లను ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు (దివ్యాంగులు, అనాథలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు) కు కేటాయించారు. 10 శాతం సీట్లను ఎస్సీలకు, నాలుగు శాతం ఎస్టీలకు, మిగిలిన ఆరు శాతం సీట్లను బలహీనవర్గాలకు చెందిన బీసీ, మైనార్టీ, ఓసీ (ఆదాయం ఆధారంగా) కేటాయించారు.

పేద కుటుంబాలకు వరం

పిల్లల చదువులకు వేలాది రూపాయలను వెచ్చించలేని నిరుపేద, బడుగు, బలహీన వర్గాలకు నిర్బంధ విద్యాహక్కుచట్టం ద్వారా ఉచిత విద్య అందుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన అర్హులైన విద్యార్థులకు 8వ తరగతి పూర్తయ్యే వరకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుంది. పేద వర్గాల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించే విధంగా చర్యలు చేపట్టాం.

– సీవీ రేణుక, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, అధికారులు

మంత్రి నారాయణ

తాడికొండ: ప్రధాని నరేంద్ర మోదీ మే 2న అమరావతి రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభానికి రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను బుధవారం మంత్రి నారాయణ పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. వర్షం వస్తే పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయం చూడాలని సీఎం ఆదేశించారని, దీనిపై పోలీసు అధికారులకు పలు సూచనలిచ్చినట్లు తెలిపారు. 3000 బస్సులు, 1000 కార్ల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఐదు లక్షలకు పైగా జనాభా వచ్చే అవకాశం ఉండటంతో పార్కింగ్‌కు మరిన్ని ప్రాంతాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. 6,500 నుంచి 7,000 బస్సులు, 3000 కార్లకు అధికారులు పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం పలుకుతున్నామని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు వెళుతున్నాయని వివరించారు. ఆయన వెంట ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, పలువురు అధికారులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

కలెక్టర్ పరిశీలన

రాష్ట్ర రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ మే 2న రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ విశ్వనాథం, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు పరిశీలించారు. ప్రధాన వేదిక, పబ్లిక్, వీవీఐపీ, వీఐపీ గ్యాలరీల వద్ద ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె. శ్రీనివాస రావు, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సజావుగా పాలిసెట్



గుంటూరు ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష బుధవారం సజావుగా జరిగింది. గుంటూరు నగరంలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,055 మంది విద్యార్థులకు గానూ 3,408 మంది హాజరయ్యారు. 84 శాతం హాజరు నమోదైనట్లు పాలిసెట్-25 సమన్వయకర్త తాళ్లూరి శేఖర్ తెలిపారు

ఎవరేమనుకుంటే మాకేంటి !



స్వయం ప్రకటిత కమిటీ ప్రమాణస్వీకారం. వేదికపై ఆలపాటి రాజా, బాలస్వామీజీ

- ఆర్యవైశ్యుల మనోభావాలతో మాకు పనేంటి !
- ముగిసిన స్వయం ప్రకటిత కమిటీ ప్రమాణస్వీకారం
- రాష్ట్ర, కేంద్ర మంత్రులు గైర్హాజరు

తెనాలి: "ఎవరేమనుకుంటే మాకేంటి.. వేలాది ఆర్యవైశ్యుల మనోభావాలతో మాకు పనేంటి" అన్నట్టుగా ఉంది శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ స్వయం ప్రకటిత పాలకవర్గం వైఖరి. వివాదం హైకోర్టులో ఉంది. ఈనెల 4న సర్వసభ్య సమావేశం నిర్వహణకు నోటీసులు జారీఅయ్యాయి. అందులో తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ప్రస్తుత పాలకవర్గం ప్రకటించింది. అయినా సరే, హడావుడిగా స్వయం ప్రకటిత కమిటీ పాలకవర్గం బుధవారం రాత్రి ప్రమాణ స్వీకారోత్సవం అనే తంతును ముగించింది. దేవస్థానం కమిటీ పాలకవర్గం అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు అస్వస్థతతో అమెరికాలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈనెల 4న జరిగే సర్వసభ్య సమావేశంలో సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని సందేశం పంపారు. ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. అయినా సరే, ఏకపక్షంగా మొండిగా స్వయం ప్రకటిత పాలకవర్గం అధ్యక్షుడిగా ప్రకటించుకున్న పెండేల వెంకట్రావు, కార్యదర్శి తాతా శ్రీనివాసరావు తదితర సభ్యుల కమిటీ రాత్రి 9 గంటల ప్రాంతంలో దేవస్థానం ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. పెనుగొండ పీఠాధిపతిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) సమక్షంలో బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా వీరితో ప్రమాణం చేయించారు. వెయ్యి మంది సభ్యులు కలిగిన దేవస్థానం కమిటీలో కనీసం రెండు వందలమంది కూడా ఈ వేడుకకు హాజరు కాలేదు. వీరిలో సగం మంది మహిళలు ఉన్నారు. మరోవైపు పోలీసులు మోహరించి ఉన్నారు. ఏదో చేశామన్నట్టుగా ప్రమాణ స్వీకారమనే తంతును కానిచ్చేశారు. కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరవుతారని ఆహ్వాన పత్రికల్లో ప్రముఖంగా వేసినా వారెవ్వరూ పాల్గొనలేదు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాత్రం హాజరయ్యారు. దేవస్థానం కార్యాలయం గది తాళాలను స్వయం ప్రకటిత కమిటీ పగులగొట్టి కొత్త తాళాలను వేసిన విషయం తెలిసిందే. అవి మినహా మిగిలిన దేవాలయం కళ్యాణ మండపాలు, రికార్డులు, బ్యాంకు ఖాతాలు అన్నీ దేవస్థానం కమిటీ ఆధీనంలోనే ఉన్నాయి. స్వయం ప్రకటిత కమిటీ పాలకవర్గం అధ్యక్షుడు పెండేల వెంకట్రావు తాళాల కోసం కమిటీ ఉపాధ్యక్షుడు ఆకి అచ్యుతరావును ఫోనులో బెదిరించిన ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. మర్యాదగా తాళాలు తీయకపోతే ఇబ్బందులు తప్పవంటూ వెంకట్రావు ఆయన్ను బెదిరించారు. ఇన్‌చార్జి కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మరో ఆర్యవైశ్య నాయకుడికీ వెంకట్రావు బెదిరింపు ధోరణిలో ఫోను చేశారు. ఈ రెండు ఆడియోలు ఇప్పుడు ఆర్యవైశ్యుల సెల్‌ఫోన్లలో రింగుమంటున్నాయి. శ్రీవాసవీ దేవస్థానంలో ఆధిపత్యం కోసం టీడీపీ చేసిన రాజకీయం ఇప్పుడు ఆర్యవైశ్యుల్లో చిచ్చు రేపింది. ఇదెక్కడకు దారితీస్తుందోనని తటస్థులు ఆందోళన పడుతున్నారు.

ప్రియాంకా... వెల్‌డన్ !

- 21 సంవత్సరాలకే రూ.1.4 కోట్ల ప్యాకేజీతో అమెజాన్‌లో ఉద్యోగం
- సత్తా చాటిన పాతమల్లాయపాలేనికి చెందిన విద్యార్థిని
- యూకేలోని అమెజాన్ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్-1గా ఆఫర్ లెటర్
- వెల్లువెత్తుతున్న అభినందనలు



తల్లిదండ్రులు, సోదరుడితో కారుమూరి ప్రియాంకరెడ్డి (కుడి చివర)



అచీవర్స్‌డేలో ప్రియాంకరెడ్డిని అభినందిస్తున్న గీతం యూనివర్సిటీ ప్రతినిధులు

ప్రత్తిపాడు: ఏపీకి చెందిన యువతి జాక్‌పాట్ కొట్టింది. అమెజాన్‌లో ఏకంగా రూ. 1.4 కోట్ల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. గీతం యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో సీఎస్‌ఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన కారుమూరు ప్రియాంకరెడ్డికి ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సంస్థలో భారీ ప్యాకేజీ ఆఫర్ చేసింది. యూకేలోని అమెజాన్ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఇంజినీర్-1గా అవకాశం లభించింది. ప్రియాక చిన్నతనం నుంచే చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేది. తొమ్మిది, పది తరగతులు గుంటూరు శ్రీ చైతన్యలో, ఇంటర్ హైదరాబాద్ చైతన్యలో పూర్తి చేసింది. అంతకుముందు కొంత కాలంలో యూఎస్‌లో కూడా విద్యనభ్యసించింది. ప్రస్తుతం గీతంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలైజేషన్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. మార్చిలో యూనివర్సిటీలో క్యాంపస్ సెలక్షన్లు జరిగాయి. మంగళవారం జరిగిన అచీవర్స్ డేలో గీతం ప్రతినిధులు ప్యాకేజీ వివరాలను వెల్లడించి, ఆఫర్ లెటర్‌ను అందించి అభినందించారు.

ఇదీ కుటుంబ నేపథ్యం

కారుమూరి శ్రీనివాసరెడ్డి, చంద్రకళ ఇద్దరూ ప్రత్తిపాడు మండలానికి చెందిన వారే. ప్రత్తిపాడుకు చెందిన చంద్రకళకు పాతమల్లాయపాలేనికి చెందిన శ్రీనివాసరెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, కుమార్తె ప్రియాంకరెడ్డి. అయితే, కొన్నేళ్ల కిందట పాతమల్లాయపాలెం నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన వీరు అక్కడే స్థిరపడ్డారు.

గతంలోనే పలు క్యాంపస్ సెలక్షన్లు

ప్రియాంక రెడ్డి క్యాంపస్ సెలక్షన్లలో ఎంపికవ్వడం ఇదే మొదటి సారి కాదు. అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ అమెజాన్ కంటే ముందు 30 లక్షల ప్యాకేజీతో బెంగళూరుకు చెందిన న్యూ సిగ్మా కంపెనీలో, యాక్సెంచర్ కంపెనీ ప్రాంగణ ఎంపికల్లో ఎంపికైంది. అయినప్పటికీ వాటిని వద్దనుకుని, అమెజాన్‌లో భారీ వేతనంతో కూడిన ఉద్యోగానికి ఎంపికైంది. దీంతో తల్లిదండ్రులు శ్రీనివాసరెడ్డి, చంద్రకళతో పాటు సోదరులు, కుటుంబ సభ్యులు ఆమెను అభినందించారు. స్వగ్రామమైన పాతమల్లాయపాలెంలో ఉన్న బంధువులు, శ్రీనివాసరెడ్డి స్నేహితులు సైతం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కోడింగ్‌పై శిక్షణ, ఫ్యాకల్టీల మార్గనిర్దేశంతో పాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో అత్యధిక గరిష్ఠ వేతనంతో ఉద్యోగానికి ఎంపకయ్యానని ప్రియాంక రెడ్డి తెలిపారు.

'హా'స్పత్రికి వెళితే అవస్థలే

- జీజీహెచ్‌లో రోగుల సహాయకులకు కష్టాలు
- బాలింతలు, గర్భిణుల వెంట వస్తే బాధలు తప్పదు
- కాన్పుల వార్డు ఎదుటే నివాసం



కాన్పుల వార్డు వద్ద ఆరుబయట నిద్రిస్తున్న సహాయకులు, కుటుంబ సభ్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో బాలింతలు, గర్భిణుల వెంట వచ్చే సహాయకులకు, కుటుంబ సభ్యులకు బాధలు తప్పడం లేదు. వార్డు బయటే పడిగాపులు కాయాల్సి వస్తోంది. పగలు ఎండ, రాత్రి పూట దోమలు, ఎలుకలతో సహవాసం చేస్తున్నారు. ఆసుపత్రి అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తుండటంతో రోగుల సహాయకుల కష్టాలకు అంతం లేదు.

పూర్వ వైద్య విద్యార్థుల వితరణ

జీజీహెచ్‌లో ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురు గర్భిణులు, బాలింతలు ఉండటాన్ని కళ్లారా చూసి అమెరికాలో స్థిరపడి గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు భారీ వితరణ చేశారు. జింఖానా పేరుతో సుమారు రూ. 100 కోట్లను మాతా శిశు సంక్షేమ కేంద్రం నిర్మాణం కోసం విరాళాలు అందజేశారు. వారు చూపించిన కరుణలో పావంతైనా ఆసుపత్రి అధికారులు చూపిస్తే రోగుల సహాయకులకు రేకుల షెడ్డు ఏర్పాటు చేయడం పెద్ద కష్టమేమీ కాదు.

ఇతర అవసరాలకు భవనాల వాడకం

గతంలో నాట్కో ట్రస్టు రోగుల సహాయకులకు వేచి ఉండేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేస్తే దాన్ని ఓపీ విభాగంలో రక్త పరీక్షలు సేకరించేందుకు (ల్యాబ్) వినియోగిస్తున్నారు. ఇన్‌పేషెంట్ విభాగంలో రోగుల సహాయకుల కోసం మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఎంపీ నిధులతో, వారి సొంత ట్రస్టు నిధులతో రూ. కోటికి పైగా వెచ్చించి భవనం నిర్మించారు. దీన్ని ఇతర వైద్య సేవల కోసం ఆసుపత్రి అధికారులు వినియోగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోగుల సహాయకులకు తప్పనిసరిగా వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. వారు ఏర్పాటు చేయకపోగా, దాతలు నిర్మించిన దాన్ని సైతం ఇతర అవసరాలకు వినియోగిస్తూ రోగుల సహాయకులను ఎండలో మాడుస్తున్నారు. రాత్రి వేళల్లో సైతం ఆరుబయటే మురుగు కాలువల పక్కన నిద్రించాల్సిన దుస్థితి నెలకొంది. ఆసుపత్రి అధికారులు ఇప్పటికైనా రోగుల సహాయకుల వసతి కేంద్రాన్ని ఏర్పాటు చేసి, బాధలు తొలగించాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

ప్రత్యేక వసతి ఏర్పాటు

కాన్పుల విభాగానికి వచ్చే బాలింతల సహాయకుల కోసం పిల్లల విభాగం వద్ద ప్రత్యేక వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. ప్రస్తుతం కాన్పుల విభాగం వద్ద ఎండ తగలకుండా గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేయిస్తున్నట్లు వెల్లడించారు. రోగుల సహాయకులు తమకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదుల వద్ద వేచి ఉండాలని పలుమార్లు వారికి కౌన్సిలింగ్ కూడా చేస్తున్నామని తెలిపారు.

ఫ్లైఓవర్‌ను బహుళ ప్రయోజనకారిగా నిర్మించాలి



ఫ్లైఓవర్ మ్యాప్ విడుదల చేస్తున్న గురుదత్

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు నగరం నడిబొడ్డున ఉన్న శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జ్ స్థానంలో ఫ్లైఓవర్‌ను రాబోయే వంద సంవత్సరాలకు ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించాలని అరండల్‌పేట అండ్ బ్రాడీపేట షాపు ఓనర్స్ అండ్ షాప్ కీపర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి, న్యాయవాది నడింపల్లి గురుదత్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో నిర్మాణం చేస్తామని వాగ్దానం చేసిన ఐకానిక్ ఫ్లైఓవర్ మ్యాపు, కూటమి ప్రభుత్వం ఇటీవల డీపీఆర్ ద్వారా ఆమోదించిన ప్లాన్లను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాపారులమైన తమకు ఎటువంటి రాజకీయ దురుద్దేశాలు అంటగట్టవద్దని ప్రజాప్రతినిధులను, అధికారులకు విజ్ఞప్తి చేశారు. స్థానిక హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వరకు ఒకటి పాయింట్ నాలుగు కిలోమీటర్ల 120 అడుగుల వెడల్పుతో అండర్ పాస్, సింగల్ పిల్లర్‌తో మెట్రో ఐకానిక్ ఫ్లై ఓవర్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధం చేశారని చెప్పారు. ప్రస్తుత కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గత ఏడాది అక్టోబర్‌లో ముందుగా ఆర్‌యూబీ నిర్మించి ఫ్లైఓవర్ నిర్మాణానికి సంకల్పించామని విలేకరుల సమావేశంలో తెలియచేశారన్నారు.అనంతరం సేతు బంధన్ పథకం ద్వారా రూ. 98 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పడం, తమతో పాటు నగరంలోని 10 లక్షల మంది ప్రజలను హతాసులను చేసిందని చెప్పారు. శంకర్ విలాస్ ఐకానిక్ ఫ్లై ఓవర్ నిర్మాణంలో భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకోకుంటే చరిత్రలో దిద్దుకోలేని తప్పు జరుగుతుందన్న వాస్తవాన్ని రాజకీయ పెద్దలు గుర్తించాలని కోరారు.

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,19,395
అమ్మకాలు	1,29,339
నిల్వ	42,556

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,200
నంబరు–5	10,000–12,500
273	10,000–12,400
341	10,000–13,200
4884	10,000–11,200
సూపర్–10	10,000–12,500
తాలుకాయలు	4,500–6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 13,700
షార్క్–1	10,000 – 12,000
బాడిగ–355	10,000 – 13,000
దేవనూరు డీలక్స్	10,000 – 12,600
ఆర్మూర్	9,800 – 11,200
తాలు	4,500 – 6,500

–కొరిటిపాడు (గుంటూరు)

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు బుధవారం 732 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 543 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,100, గరిష్ఠ ధర రూ.11,300, మోడల్ ధర రూ.10,700 పలికింది. కాయలు 189 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,100. గరిష్ఠ ధర రూ.11,300, మోడల్ ధర రూ.10,700 పలికింది. మొత్తం 549 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు కార్యదర్శి తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మంగళగిరి: పట్టణ పరిధిలోని చినకాకానిలో శతాధిక వృద్ధురాలు నేరెళ్ల జయలక్ష్మి(105) బుధవారం మృతి చెందారు. నాలుగో కుమారుడు మురళి నివాసంలో ఉంటున్న ఆమె కొంతకాలంగా అనారోగ్యం బారినపడి చికిత్స పొందుతున్నారు. ఆమెకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

పొగాకు కొనుగోలు చేసే వరకు ఉద్యమం

లక్ష్మీపురం: రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేసే వరకు ఉద్యమం ఆగదని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వి.కృష్ణయ్య, కె.వి.వి.ప్రసాద్ తెలిపారు. గుంటూరులోని బ్రాడీపేట పి.ఎల్.రావు భవన్‌లో బుధవారం రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు మాసాల నుంచి బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు దీనస్థితిలో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర నాయకులు ఎం. హరిబాబు, పి.జమలయ్య, వై.రాధాకృష్ణమూర్తి, రైతు కూలీ సంఘం నాయకులు వేల్పూరి నరసింహారావు పాల్గొన్నారు.

ధైర్యే సాహసే విజయం

జీవితం చాలా పెద్దది. అందులో మనం రాసే పరీక్ష ఎంతో చిన్నది. కేవలం ఒక్క పరీక్షకే ఆత్మస్థైర్యాన్ని కోల్పోతే పిరికితనం.సాధించాలన్న తపనతో జీవిత పరీక్ష నెగ్గాలి. నవమాసాలు మోసిన కన్నతల్లి.. బరువు బాధ్యత నెత్తికెత్తుకున్న తండ్రి గుండెలు పగిలి.. జీవితాంతం హృదయ భారాన్ని మోసేలా.. తనువు చాలించడం బాధాకరం. సాధించాలన్న తపన ఎంతటి కష్టాన్నైనా ఎదుర్కొనే మనోబలాన్ని ఇస్తుంది. తక్కువ మార్కులు వచ్చినా, ఫెయిలైనా జీవితం ముగిసి పోదు. క్షణికావేశ నిర్ణయాలు మంచిది కాదు. నిరాశ చెందకుండా మరింత పట్టుదలతో ముందుకు సాగితే విజయం మన సొంతమవుతుంది.

- మనోవ్యధతో రాలుతున్న విద్యా కుసుమాలు
- ఫెయిల్ అయింది పరీక్షే.. జీవితం కాదు
- విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోకూడదు
- తల్లిదండ్రుల పర్యవేక్షణ ఎంతో అవసరం

పట్నంబజారు: మిస్సైల్ రంగంలో భారతదేశ రూపురేఖలు తీర్చిదిద్దిన భారతరత్న అబ్దుల్ కలాం పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చేవి. అయినా పట్టుదలతో ముందడుగు వేయడంలో ఆయను గొప్ప శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఖ్యాతి చెందారు. భారతరత్నగా నిలిచారు. క్రికెట్ ప్రపంచంలో కీర్తించే సచిన్ టెండూల్కర్ పదో తరగతి తప్పిన విషయం స్వయంగా ఆయన చెప్పాడు. ఎంతో మంది విద్యావేత్తలు, గొప్ప వ్యక్తులు పరీక్షల్లో ఫెయిల్ అయిన తరువాతే.. జీవిత పరీక్షలో ఉన్నత శిఖరాలు అధిరోహించారు.

తల్లిదండ్రులకు కడుపుకోత

పరీక్ష ఫెయిల్ అయ్యామని, అర్ధంతరంగా, క్షణికావేశంలో విద్యార్థులు తనువు చాలిస్తున్నారు. ఆశలన్నీ పిల్లలపైనే పెట్టుకొని బతుకుతున్న తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చిన పరిస్థితులు ఎంతో బాధాకరం. ఒక్కటంటే ఒక్క నిమిషం మనసు నిబ్బరంగా చేసుకొని ప్రశాంతంగా ముందున్న భవిష్యత్తు, తల్లిదండ్రుల గురించి ఆలోచిస్తే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉండేది కాదు.



దుగ్గిరాలలో మృతి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి అవినాష్ (ఫైల్)

- కొద్ది రోజుల కిందట ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షల ఫలితాలు వెలువడ్డాయి. దుగ్గిరాల మండలం చినపాలెంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసిన చెన్ను అవినాష్, రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాననే బాధతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- గుంటూరు లాలాపేటకు చెందిన కె. అభినవ్ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయని, మనస్తాపంతో ఎవరికి చెప్పకుండా తాడేపల్లి రైల్వే స్టేషన్ దగ్గరకు వెళ్లాడు. సెల్‌టవర్ ఆధారంగా పోలీసులు విద్యార్థిని గుర్తించి రక్షించారు.
- నగరంలో తూర్పు నియోజకవర్గ పరిధిలో కూడా ఓ విద్యార్థిని కూడా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ కావడంతో ఆత్మహత్యయత్నం చేసే ప్రయత్నం చేసింది. దీనిని గమనించిన తల్లితండ్రులు కాపాడి, విషయం బయటకు పొక్కకుండా చూసుకోవడంతో ఎటువంటి కేసు నమోదు కాలేదు.

ముందు ఎంతో జీవితం

పరీక్షలు రాసే ప్రతి విద్యార్థి ఇదే ఆఖరిది కాదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. పాస్, ఫెయిల్ అనేవి జీవితంలో అత్యంత సర్వసాధారణమైన విషయంగా భావించాలి. ఏ తప్పు వల్ల ఫెయిల్ అయ్యామనే విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి. ఇకపై ఆ తప్పు జరగకుండా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. ఒత్తిడి నుంచి వేగంగా బయటపడేందుకు ప్రయత్నించాలి. వెనకబడిన పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఉపాధ్యాయులు, సీనియర్లు, తల్లిదండ్రుల సలహాలు తీసుకుని ముందుకు సాగాలి.

ఫెయిల్ అయితే ఓటమి కాదు



పరీక్ష ఫెయిల్ అయితే జీవితంలో ఓడిపోయినట్లు కాదన్న విషయాన్ని విద్యార్థులు గుర్తించాలి. గెలుపోటములకు కుంగిపోవడం, మానసిక స్థైర్యాన్ని కోల్పోవడం అంటే మనకి మనం ఓటమిని అంగీకరించటమే. ప్రపంచ కుబేరుల్లో ఎక్కువ మంది పెద్ద చదువులు చదివిన వారే లేరు. వారు చేసిందల్లా ఒకటే.. నచ్చిన మార్గంలో ప్రయాణించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం. మన సర్టిఫికెట్లు అర్హతగానే పరిగణించాలి. మార్కులు తక్కువ వచ్చాయనో, మనం కోరుకున్న కళాశాలలో సీటు దక్కలేదనో కుంగుబాటుకు గురవటం అనవసరం. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని తెలుసుకున్న రోజు ప్రపంచంలో మనకన్నా గొప్పవారు ఎవరూ ఉండరు.

–నీలి ఉమాజ్యోతి (మానసిక వ్యాధుల, విభాగాధిపతి, గుంటూరు జీజీహెచ్)

తల్లిదండ్రులే ధైర్యం చెప్పాలి

లక్షలాది రూపాయలు పెట్టి చదివించాం.. ఫెయిల్ అయ్యాడనే భావనంతో కాకుండా.. పరీక్షల్లో తప్పిన విద్యార్థులను తల్లిదండ్రులు ధైర్యం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు సైతం ఎంతో ఒత్తిడికి లోనవుతున్న పరిస్థితిని అర్థం చేసుకోవాలి. చిరునవ్వుతో సప్లమెంటరీ రాద్దాంలే అని చెప్పే మాట ఎంతో మనోధైర్యాన్ని కల్పిస్తుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఫెయిల్ అయిన విద్యార్థులు ముభావంగా ఉన్నా, పరధ్యానంలో ఉన్నా వారిని ఒంటరిగా వదలిపెట్టొద్దు. ఫెయిల్ అవ్వడం వల్ల నష్టం లేదని ధైర్యాన్ని చెప్పారు.

లక్ష్యానికి చేరుకోని మార్కెటింగ్ శాఖ

88.16 శాతంతో సరి



సహాయ సంచాలకులు బి.రాజబాబు

కొరిటిపాడు(గుంటూరు): నిర్దేశిత లక్ష్యానికి చేరకుండానే మార్కెటింగ్ శాఖ చతికిలపడింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గుంటూరు జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా రూ.133.69 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో 88.16 శాతంతో రూ.117.87 కోట్లు వసూలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు వెల్లడించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పొన్నూరు మార్కెట్ యార్డు రూ.6.95 కోట్లకు గానూ 105.64 శాతంతో రూ.7.34 కోట్లకు పైగా సాధించి మొదటి స్థానంలో నిలిచింది. దుగ్గిరాల 104.06 శాతం, ప్రత్తిపాడు 102.16 శాతం, తెనాలి 101.67 శాతం సాధించి లక్ష్యాన్ని చేరుకున్నాయి. తాడికొండ మార్కెట్ యార్డు లక్ష్యం రూ.2.10 కోట్లు కాగా, 90.67 శాతంతో రూ.1.90 కోట్లకు పైగా వసూలు చేసి లక్ష్యానికి చేరువగా నిలిచిపోయింది. మిగిలిన వాటిలో గుంటూరు మార్కెట్ కమిటీ 85.74 శాతం, ఫిరంగిపురం 78.65 శాతం కాగా, ఆఖరి స్థానంలో మంగళగిరి మార్కెట్ కమిటీ 73.96 శాతంతో లక్ష్యానికి ఆమడదూరంలో ఆగిపోయింది. ఈ క్రమంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా మార్కెటింగ్ శాఖకు రూ.146.31 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఏడీఎం తెలిపారు. ఇందులో అత్యధికంగా గుంటూరు మార్కెట్ కమిటీకి రూ.115 కోట్లు టార్గెట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. తెనాలి మార్కెట్ కమిటీకి రూ.7.65 కోట్లు, దుగ్గిరాల రూ.3.75 కోట్లు, పొన్నూరు రూ.8.38 కోట్లు, మంగళగిరి రూ.3.03 కోట్లు, ఫిరంగిపురం రూ.1.88 కోట్లు, తాడికొండ రూ.2.17 కోట్లు, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీకి రూ.4.45 కోట్లు లక్ష్యం విధించినట్లు ఆయన వివరించారు.



గుంటూరు మార్కెట్ కమిటీ

బైకుతో ఢీకొట్టి వృద్ధుడిపై దాడి

వట్టిచెరుకూరు: వృద్ధుడిని బైకుతో ఢీకొట్టి ఆపై దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడుకు చెందిన మురుకుట్ల సాంబశివరావు మంగళవారం సాయంత్రం తన నర్సరీ లోపల ఉన్నాడు. బయట ఓ దుకాణం వద్ద వాదులాట జరుగుతుండటంతో చూద్దామని వచ్చాడు. ఆ తర్వాత మోపెడ్‌పై నర్సరీ నుంచి ఇంటికి బయల్దేరాడు. అక్కడే ఉన్న గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సాంబశివరావును వెంబడించి వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. కింద పడిన అతడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో సాంబశివరావు తలకు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. సాంబశివరావు భార్య రోశమ్మ ఫిర్యాదు మేరకు వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 14 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ: బైక్‌లు చోరీ చేస్తున్న అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను బుధవారం నల్లగొండ జిల్లా వాడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 14 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఏపీలోని గుంటూరు జిల్లా చిలుకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన నలమాల ఎర్రబ్బాయి అలియాస్ లూథర్, అదే గ్రామానికి చెందిన గంజి అంకమరావు, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపహాడ్ గ్రామానికి చెందిన వట్టిపల్లి శ్రీకాంత్ ముఠాగా ఏర్పడ్డారు. బైక్‌లు చోరీ చేసి వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. నలమాద ఎర్రబాబు తెలంగాణలోని నల్లగొండ, దామరచర్ల, నార్కట్‌పల్లి, ఇబ్రహీంపట్నంతో పాటు ఏపీలోని మార్టూరు, పొన్నూరులో ప్రభుత్వ కార్యాలయాలు, హోటళ్లు, వైన్స్‌లు, రాత్రివేళ ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేసి, వాటిని గంజి అంకమరావు, మట్టిపల్లి శ్రీకాంత్‌తో కలిసి తక్కువ ధరకు విక్రయించేవాడు. బుధవారం ఉదయం వాడపల్లి ఎస్‌ఐ సిబ్బందితో కలిసి రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎర్రబ్బాయి, అంకమరావు చోరీ చేసిన బైక్‌లను అమ్మడానికి దామరచర్ల నుంచి గుంటూరు వైపు వెళుతున్నారు. అనుమానం వచ్చి ఎస్‌ఐ వారిని పట్టుకుని విచారించగా నిజం ఒప్పుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు మట్టిపల్లి శ్రీకాంత్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఏడు పల్సర్ బైక్‌లు, ఒక షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.26.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. ముగ్గురు నిందితులపై వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో– 3, నల్లగొండ వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లల్లో ఒక్కోటి చొప్పున, నార్కట్‌పల్లి పీఎస్‌లో– 2, ఇబ్రహీంపట్నం పీఎస్‌లో– 1, ఏపీలోని మార్టూర్ పీఎస్‌లో– 2, పొన్నూరు పీఎస్‌లో –1, రాజమండ్రిలో– 1 కేసు నమోదైనట్లు ఎస్పీ పేర్కొన్నారు. మొత్తం 22 బైక్‌లు దొంగిలించినట్లుగా నిందితులు అంగీకరించారని, మిగతా వాహనాలను కూడా స్వాధీనం చేసుకుంటామని ఆయన తెలిపారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో ఈ కేసును ఛేదించిన రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్, సీసీఎస్ సీఐ డానియేల్, వాడపల్లి ఎస్‌ఐ ఎ. శ్రీకాంత్ రెడ్డి, పోలీస్ సిబ్బంది సతీష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, రషీద్, సీసీఎస్ సిబ్బంది విష్ణువర్ధనగిరి, రాంప్రసాద్, పుష్పగిరి, శ్రీనివాస్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

విద్యారంగంలో అసంబద్ధ విధానాలపై ఆందోళన

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవ లింగారావు

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు నిరసనగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి ఆందోళన, పోరాటాలు చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. బసవలింగారావు, మొహమ్మద్ ఖాలీద్ పేర్కొన్నారు. కన్నావారితోటలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. 117 జీవోను రద్దు చేసి, పాఠశాల విద్యను ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుగా పూర్వస్థితికి మార్చుతామని చెప్పిన ప్రభుత్వం మోసపూరితంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఉన్నత పాఠశాలల్లో 3,4,5 తరగతులు కొనసాగించడమే కాకుండా కొన్నిచోట్ల ఒకటి నుంచి టెన్త్ వరకు తరగతులు నిర్వహిస్తామని చెప్పడం ఉపాధ్యాయ, విద్యార్థిలోకాన్ని మోసం చేయడమేనని విమర్శించారు. తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థను తీసుకురావడం ద్వారా విద్యారంగాన్ని విధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రాథమిక పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమాన్ని ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయాలకు ఈనెల 5న తేదీ పాత తాలుకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, మే 9న జిల్లా కేంద్రంలో ధర్నా, మే14 న విజయవాడలో రాష్ట్రస్థాయిలో ధర్నా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. మొత్తం 12 డిమాండ్స్ పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్.ఎన్. మూర్తి, జి.దాస్, జిల్లా కౌన్సిలర్లు పి.శివరామకృష్ణ, చక్కా వెంకటేశ్వర్లు, గురుమూర్తి, జహంగీర్, షూకూర్, మాలకొండయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బసవ లింగారావు